క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఆడారి ఆనంద్‌కుమార్, పీవీ సురేష్

మల్కాపురం: విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023లో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శనివారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం



ఎస్‌బీఐ మేనేజర్ జానకిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్

గోపాలపట్నం: నరవ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం ఉమెన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉమెన్స్ గ్రీవెన్‌సెల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని గోపాలపట్నం ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వై.జానకి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ స్త్రీ పురోగతిని, ప్రాముఖ్యతను గురించి వివరించారు. పలువురు మహిళలు సాధించిన విజయాల్ని ఆమె వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ పట్నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శభాష్ వలంటీర్

- కాకినాడ వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ ఇస్తున్న వలంటీర్ సూర్య

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డులోని ఓ వార్డు వలంటీర్ తన సొంత ఖర్చులతో కాకినాడ వెళ్లి పింఛన్ అందజేసి అందరి మన్ననలు పొందాడు. వివరాలిలా.. 58వ వార్డు ఉప్పర కాలనీ ఏరియా వలంటీర్‌గా (సచివాలయం కోడ్–21086328) బొండాడ సూర్య ఉన్నాడు. అయితే తన పరిధిలోని పింఛన్‌దారు జవ్వాది అప్పలరాజు ఇంటికి సూర్య ఈ నెల ఒకటి నుంచి వెళ్తున్నాడు. అయితే తాళం వేసి ఉండడంతో బయటకు వెళ్లి ఉంటారని భావించాడు. శుక్రవారం ఉదయం వెళ్లే సరికి చుట్టుపక్కల వారు అప్పలరాజుకు ఆరోగ్యం బాగాలేదని కాకినాడలోని తన కుమారుడు వద్దకు వైద్య చికిత్స నిమిత్తం వెళ్లారని చెప్పారు. దీంతో సూర్య శనివారం ఉదయం తన సొంత ఖర్చులతో కాకినాడ వెళ్లి వృద్ధుడు అప్పలరాజుకు పింఛన్ అందజేశాడు.దీంతో వలంటీర్ సేవా భావాన్ని పలువురు అభినందించారు.

ముగిసిన శిక్షణ శిబిరం



శిక్షణ పొందిన విద్యార్థులతో బెహరా విజయ చైతన్య సిబ్బంది

గోపాలపట్నం: బెహరా ఐటీఐ టెక్నికల్ క్యాంపస్‌లో ఎయిర్‌కండీషనర్ మెకానిజంపై నాలుగు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. రిఫ్రిజిరేటర్, ఎయిర్‌కండిషనర్, ఆపరేషన్స్, ట్రబుల్స్‌ను గుర్తించడం వంటి అంశాలుపై బెహరా ఐటీఐలో శిక్షణ ఇచ్చారు. శిబిరంలో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బెహరా విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ విజయచైతన్య మాట్లాడుతూ సాధారణ శిక్షణతో పాటు నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. ఇది విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన కల్పించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు లీలా ప్రసాద్, హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మిట్ సందడి

- రెండో రోజూ అదే జోష్
- జీఐఎస్ సదస్సు విజయవంతం



సచివాలయ సిబ్బంది సెల్ఫీ



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుకు వస్తున్న ప్రతినిధులు

ఏయూక్యాంపస్: విశాఖ వేదికగా ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ రెండో రోజు శనివారం విజయవంతంగా ముగిసింది. సదస్సులో పాల్గొనడానికి ఉదయం నుంచి పెద్దసంఖ్యలో పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. ప్రవేశ మార్గం వద్ద ప్రతీ ఒక్కరిని గుర్తింపు కార్డులు, క్యూఆర్ కోడ్‌ను పరిశీలించి లోపలికి అనుమతించారు. సదస్సు ప్రాంగణంలో పోలీసులు బాంబ్ స్క్వాడ్, స్నిపర్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. సదస్సు నిర్వహణలో ఎటువంటి భద్రతాపరమైన లోపాలు తలెత్తకుండా పోలీసులు ప్రశంసనీయ పాత్ర పోషించారు.

విజయవంతమైన సదస్సు..

రెండు రోజుల జీఐఎస్ సదస్సు పూర్తి స్థాయిలో విజయవంతమైంది. పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు రెండో రోజు సైతం హాజరయ్యారు. విభిన్న వేదికలపై ఏకకాలంలో పెట్టుబడులకు సంబంధించి పారిశ్రామిక వేత్తలు ఎంవోయూలు కుదుర్చుకున్నారు. వచ్చిన లక్ష్యం నెరవేరడంతో సదస్సుకు వచ్చిన పారిశ్రామిక వేత్తల్లో జోష్ కనిపించింది. పలువురు పారిశ్రామిక వేత్తలు సదస్సు ప్రాంగణంలో సెల్ఫీలు తీసుకుంటూ కనిపించారు. ముఖ్యంగా రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులు పెట్టడానికి యువత రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయం స్టాల్ మంచి ఆదరణ పొందింది. వార్డు/గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రత్యేకతలను వివిధ దేశాల ప్రతినిధులకు సిబ్బంది వివరించారు. ఏపీలో సచివాలయ వ్యవస్థ ద్వారా అందిస్తున్న సేవలను ప్రతినిధులు ప్రశంసించారు.

విద్యార్థుల సందడి..

సదస్సులో రెండో రోజున విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. ఆంధ్రా యూనివర్సిటీతో పాటు నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో సదస్సులో పాల్గొన్నారు. సదస్సులో జరుగుతున్న ఎంవోయూలు, సెషన్స్‌ను వీక్షించడానికి, నూతన జ్ఞానాన్ని పొందడానికి ఆసక్తి చూపారు. దీంతో సమ్మిట్ ప్రాంగణం విద్యార్థులతో కళకళలాడింది. మేనేజ్‌మెంట్, టెక్నాలజీ రంగాల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు సదస్సులో పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో విదేశీ విద్యార్థులు సైతం హాజరయ్యారు.

నెట్‌వర్క్ డెవలప్‌మెంట్..

విభిన్న రంగాలలో పనిచేస్తున్న నిపుణులు తమ నెట్‌వర్క్‌ను డెవలప్ చేసుకోవడానికి ఈ సదస్సును వేదికగా మలుచుకున్నారు. విభిన్న సంస్థల్లో పనిచేస్తున్న అధికారులు, నిర్వాహకులతో మాట్లాడారు. తాము పనిచేస్తున్న రంగాలను ఆయా సంస్థలతో అనుసంధానించే దిశగా చర్చలు జరిపారు. పరోక్షంగా అనేకమంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఈ సదస్సు ఒక మంచి వేదికగా నిలచి వారి పరిధిని విస్తృతం చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది.

భారతీయ కళలకు ఫిదా

పలువురు భారతీయ కళలకు ఫిదా అయ్యారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన బొబ్బిలి వీణ నుంచి శ్రావ్యంగా వచ్చే సంగీతాన్ని వింటూ విదేశీయులు తన్మయత్వానికి లోనయ్యారు. సర్వసిద్ధి లక్ష్మణ స్వామి బొబ్బిలి వీణపై శ్రావ్యంగా స్వరాలను పలికిస్తుంటే విదేశీయులు తెల్‌ఫోన్లతో వీటిని చిత్రీకరించారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. యలమంచిలికి చెందిన జయవాణి అక్కడికక్కడే తాటాకుతో దండలు చేసి సందర్శకులను ఆకట్టుకున్నారు. చేనేత మగ్గాన్ని ప్రదర్శనలో ఉంచారు. తోలు బొమ్మలు, హస్తకళా రూపాలు, చేనేత వస్త్రాలను చూడడానికి భారతీయులతోపాటు, విదేశీయులు ఆసక్తి చూపారు.



విదేశీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఔత్సాహికులు



బొబ్బిలి వీణను కెమెరాలో బంధిస్తున్న విదేశీయులు

'కమ్యూనికేటివ్ ఇంగ్లిష్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

గోపాలపట్నం: కమ్యూనికేటివ్ ఇంగ్లిష్ అనే పుస్తకాన్ని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం నగరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లాంగ్వేజ్ ట్రైనర్ కిరీటి చంద్రశేఖర్‌ను ఆయన అభినందించారు. స్పోకెన్ ఇంగ్లిష్‌లో పట్టు సాధిస్తే జీవితంలో ఉన్నత స్థానాలు చేరుకుంటారన్నారు. గ్లోబల్ భాషగా ఉన్న ఇంగ్లిష్ నేర్చుకోవడం అవసరమన్నారు. అందరికీ సులువుగా అర్థమయ్యే విధంగా ఉండేందుకు కమ్యూనికేటివ్ ఇంగ్లిష్ అనే పుస్తకాన్ని రాసినట్టు చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో సత్య విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ శశి భూషణ్ మజ్జి, జీవన నైపుణ్యాల నిపుణుడు జెట్టి దొంతల, సిడగం రామకృష్ణ పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి విశేష పూజలు

కంచరపాలెం: స్థానిక తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వరుడి ఆలయంలో స్వామి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి జగన్నాథశర్మ, శంకరశర్మ నేతృత్వంలో వేకువజాము నుంచి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, గంటా కామరాజు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

రైల్వే సమస్యలపై కదిలిన కమిటీ

- రైల్వే అధికారుల విస్తృత పర్యటన
- సమస్యల పరిష్కారానికి ఆడారి ఆనంద్‌కుమార్ విజ్ఞప్తి



ఐదు మదుముల వద్ద పరిశీలిస్తున్న అసిస్టెంట్ డీఆర్‌ఎం శ్రీనివాస్, ఆనంద్‌కుమార్



చాకలి గెడ్డ వద్ద కాలవను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు, పార్టీ నాయకులు

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని రైల్వేకు సంబంధించిన పలు సమస్యలపై అధికార యంత్రాంగం కదిలింది. రైల్వే అసిస్టెంట్ డీఆర్‌ఎం శ్రీనివాస్, అధికారులు, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, ఆయా వార్డుల నాయకులతో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఇటీవల నియోజకవర్గంలోని రైల్వే సమస్యలను డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి దృష్టికి ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు తీసుకెళ్లారు. దీనిపై ఆయన ప్రత్యేక కమిటీ వేయడంతో 52, 56, 57, 89, 90, 91, 92 వార్డుల్లో రైల్వే అధికారులు పర్యటించారు.

సమస్యల పరిశీలన.. విజ్ఞప్తులు

రైల్వే అధికారుల కమిటీ దృష్టికి ఆయా ప్రాంతాల సమస్యలను ఆడారి ఆనంద్‌కుమార్ తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వాటి వివరాలిలా..

- 52వ వార్డు కరాసాలో రైల్వే స్థలానికి ఆనుకుని ఉన్న గెడ్డ ఆధునికీకరణ పనులకు ఇబ్బంది లేకుండా చూడాలి.
- 56వ వార్డులో ఆర్పీ పేట అండర్ పాస్‌వే రోడ్డు, డ్రైనేజీల మరమ్మతులను పరిశీలించారు.
- చాకలి గెడ్డ దయానంద్‌నగర్‌లో రైల్వే ట్రాక్ వద్ద స్థానికుల రాకపోకలకు అనువుగా రోడ్డు నిర్మించాలి.
- 57వ వార్డు సుభాష్‌నగర్ అండర్ పాస్‌వే, డ్రైనేజీల నిర్మాణం, శ్యామ్‌నగర్‌లో రహదారి, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాలి.
- భరత్‌నగర్ నూకాలమ్మ గుడి వద్ద రైల్వే స్థలంలోని కాలువలో పూడికలు తొలగించేందుకు అనుమతివ్వాలి.
- 89వ వార్డు చంద్రగనర్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ విస్తరణ పనుల వల్ల ఇళ్లు కోల్పోయిన స్థానికులకు పునరావాసం కల్పించాలి.
- 90వ వార్డులోని రైల్వే స్థలంలో ఉన్న డ్రైనేజీలో పూడికలు తొలగించేందుకు అధికారులు అనుమతించాలి.
- 91, 92 వార్డుల్లో బాజి జంక్షన్ వద్ద ఎస్సీ కాలనీ అంబేడ్కర్ విగ్రహం నుంచి గోపాలపట్నం శ్మశాన వాటిక వెనుక రోడ్డును అభివృద్ధి చేయాలి.
- పాత గోపాలపట్నం జువ్వాలమ్మ కాలనీలో 30 ఏళ్లుగా నివసిస్తున్న కుటుంబాలకు సొంతిళ్ల నిర్మాణానికి అనుమతించాలి.
- శ్రీరామ్‌నగర్‌లోని రైల్వే స్థలంలో డ్రైనేజీ నిర్మాణానికి అనుమతించాలి.
- వెంకటాపురం – నరవ రహదారిలో ఉండే ఐదు మదుముల్లోని రెండింటిలో డ్రైనేజీ నిర్మించాలి. మిగిలిన మదాల నుంచి నడక దారి నిర్మించాలని అసిస్టెంట్ డీఆర్‌ఎం శ్రీనివాస్‌ను ఆడారి కోరారు.

అధికారుల పర్యటన ప్రయోజనకరం

ఈ సందర్భంగా సమన్వయకర్త ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రైల్వే అధికారుల కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన పరిష్కారాలను సూచిస్తారని తెలిపారు. ఈ కమిటీ పర్యటించడం మంచి ప్రయోజనాన్నిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలు, ఇబ్బందులను గుర్తించారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, కార్పొరేటర్ ముర్రు వాణి, పార్టీ వార్డు అధ్యక్షులు ఆడారి శ్రీనివాసరావు, చుక్క ప్రసాదరెడ్డి, దొడ్డి కిరణ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



60వ వార్డులో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సురేష్



సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో కరపత్రాలు అందిస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: నియోజకవర్గంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ ప్రచారం చేశారు. వార్డులోని పలు ప్రాంతాల్లో పట్టభద్రుల వద్దకు వెళ్లి సీతంరాజుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని అభ్యర్థిస్తూ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నేవి అనిల్, బిల్డర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

- 61వ వార్డులోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల, పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ కొణతాల సుధ ప్రచారం నిర్వహించారు. సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు దాడి సత్యనారాయణ, కొల్లి నూకరెడ్డి, బూస అప్పలరెడ్డి, చట్టి నూకరాజు యాదవ్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ మద్దతు అభ్యర్థి చిరంజీవిరావు

- టీడీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యే పి.గణబాబుతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. మల్కాపురం, శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లోని కళాశాలలు, పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులను, డిగ్రీ విద్యార్థులను కలిసి తనకు తొలి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని చిరంజీవిరావు కోరారు.

భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

- హిందుస్థాన్ షిప్‌యార్డ్ డైరెక్టర్ గుప్తా
- ఘనంగా జాతీయ భద్రతా దినోత్సవం



ఉద్యోగులకు బహుమతులు అందిస్తున్న జేసీ గుప్తా



వేడుకల్లో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ సంస్థలో శనివారం 52వ జాతీయ భద్రతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, కార్మికులు 'మా లక్ష్యం హాని శూన్యం' అని భద్రతా ప్రతిజ్ఞ చేశారు. 2022–23వ ఆర్థిక సంవత్సర త్రైమాసికంలో 4 వేల మందికి హిందుస్థాన్ షిప్‌యార్డ్ భద్రతా క్యూకార్డులను జారీ చేసింది. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సంస్థ కార్పొరేట్ ప్లానింగ్ అండ్ పర్సనల్ డైరెక్టర్ సీడీఆర్ జేసీ గుప్తా ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. రోజు వారి జీవితంలో భద్రత, ఆరోగ్యం, పర్యావరణ ప్రాధాన్యాలను వివరించారు. ఉద్యోగులు, కార్మికులు పనిచేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేస్తూ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. వివిధ భద్రతా అంశాలపై చర్చిస్తూ హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో సున్నా ప్రమాద రహిత వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, జ్ఞాపికలను జేసీ గుప్తా అందజేశారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రి వద్ద రోడ్డు ప్రమాదం

- ముగ్గురు యువకులకు గాయాలు



గాయపడిన యువకుడు



దెబ్బతిన్న స్కూటీ

మల్కాపురం: ఓ ఆటో డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ముగ్గురు యువకులు గాయపడ్డారు. కంటి పరీక్ష చేసుకునేందుకు నగరానికి వెళ్తున్న యువకులు ఇలా ప్రమాదానికి గురికావడంతో వారు తల్లిదండ్రులు ఆవేదన చెందారు. ఈ ఘటనపై మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు .. శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన మోహన్,కౌశిక్,నాగేంద్ర అనే యువకులు పెద్ద గంట్యాడ వద్ద గల ప్రభుత్వ ఐటీఐ (న్యూ ఐటీఐ)లో చదువుతున్నారు. అయితే వీరు ముగ్గురూ ఎంవీపీ కాలనీలోని నేత్ర వైద్య కేంద్రానికి కంటి పరీక్షల కోసం శనివారంద్విచక్రవాహనంపై శ్రీహరిపురం నుంచి నగరం వైపు బయలుదేరారు. మార్గమధ్యలో ఈఎస్‌ఐ ఆస్పత్రి వద్దకు వచ్చే సరికి షీలానగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్లక్ష్యంగా యూ టర్న్ తీసుకున్నాడు. ఆ సమయంలో ఆటో వెనుక వస్తున్న ముగ్గురు యువకులు గమనించక ఆటోను ఢీ కొట్టారు.దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

వెంకటాద్రికి ఉచిత బస్సు సౌకర్యం



పూజ చేస్తున్న అంబికా గణేష్, రామానుజమ్

సింహాచలం: పెందుర్తిలోని వెంకటాద్రికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం భక్తుడు, అంబికా స్వీట్స్ అధినేత గణేష్ కొత్త బస్సు కొనుగోలు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి శనివారంతోపాటు ప్రత్యేక ఉత్సవాల రోజుల్లో భక్తులను వెంకటాద్రిపైకి ఉచితంగా తీసుకెళ్లి తీసుకువస్తారు. వెంకటాద్రిపై శనివారం బస్సుకు ఆలయ ప్రధానార్చకుడు రామానుజమ్ పూజలు నిర్వహించారు. అనంతరం అంబికా గణేష్ బస్సును ప్రారంభించారు. రామానుజమ్ మాట్లాడుతూ వెంకటాద్రికి భక్తుల రద్దీ విశేషంగా పెరగడంతో బస్సు ఏర్పాటు చేశారన్నారు. ప్రతీ శనివారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

సేఫ్టీ పరికరాలపై విద్యార్థులకు అవగాహన

మురళీనగర్: పరిశ్రమల్లో భద్రతా విధానాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. సమగ్ర శిక్ష సౌజన్యంతో పరిశ్రమల సందర్శనలో భాగంగా గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ 6, 7, 8 తరగతుల విద్యార్థులు శనివారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలోని సేఫ్టీ విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇక్కడి కళాశాలలో ఫైర్ అండ్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సులను ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో కూడా సేఫ్టీ విభాగాలు పనిచేస్తాయన్నారు. విద్యార్థులు ఇంటర్, డిగ్రీ తర్వాత సేఫ్టీ కోర్సులు చేయడం ద్వారా అత్యధిక వేతనాలతో ఉద్యోగాలు పొందవచ్చని ప్రిన్సిపాల్ చెప్పారు. ఫైర్‌సేఫ్టీలో ప్రయోగాత్మక విధానాన్ని విద్యార్థులు అధ్యయనం చేశారు. వివిధ పరికరాల ఉపయోగాలను స్వయంగా పరిశీలించి తెలుసుకున్నారు. సేఫ్టీ విభాగాల ఇన్‌చార్జులు డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, ఎ.వరహాలు సేఫ్టీ పరికరాల ఉపయోగాలను వివరించారు.